www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 13 ఏప్రిల్ 2023 | 5 | పశ్చిమ గోదావరి



13,460 మందికి ఇబిసి నేస్తం లబ్ధి : కలెక్టర్

భీమవరం :మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం ఇబిసి నేస్తం పథకం రెండో విడత ఆర్థిక సాయాన్ని సిఎం జగన్ ప్రకాశం జిల్లా మార్కాపురం బహిరంగసభలో బటన్ నొక్కి విడుదలచేశారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలునుండి కలెక్టర్ ప్రశాంతి పాల్గొని వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసేందుకు వివిధ పథకాలను ప్రవేశపెట్టి మహిళల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు నగదును వివిధ వ్యాపార ప్రారంభాలకు పెట్టుబడిగా పెట్టి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో వైఎస్ఆర్ ఇబిసి నేస్తం కింద అర్హులైన 13,460 మంది మహిళలకు రూ.20 కోట్ల 19 లక్షలు వారి ఖాతాల్లో జమచేశారని చెప్పారు. జిల్లాలోని వివిధ అగ్రవర్ణాలకు చెందిన పేద మహిళలకు కమ్మ 3,091, రెడ్డి 2,496, ఆర్యవైశ్య 2,538, బ్రాహ్మణ 1,240, క్షత్రియ 3,858, వెలమ 45తో పాటు ఇతర ఓసి సామాజిక తరగతికి చెందిన మొత్తం 13,460 మంది మహిళలకు రూ.20 కోట్ల 19 లక్షల నగదును వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

ఎస్‌పి మేడం.. మా బాధలు చూడండి..!



20 ఏళ్ల తర్వాత మహిళా ఎస్‌పిగా మేరీ ప్రశాంతి

తమగోడు వినాలని సచివాలయ మహిళా పోలీసుల ఆవేదన

నిబంధనలకు విరుద్ధంగా విధులతో నరకయాతన

అర్ధరాత్రులు, పండుగల్లోనూ బాధ్యతలు

జిఒ 59ను ఉపసంహరించుకున్నా మారని స్టేషన్ అధికారుల తీరు

మహిళా ఎస్‌పిగా తమ సమస్యలు పరిష్కరిస్తారని అంతా ఆశలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఎస్‌పి మేడం.. ఒక్కసారి మా బాధలు చూడండి' అంటూ సచివాలయ మహిళా పోలీసులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన డి.మేరీప్రశాంతిని వేడుకుంటున్నారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత జిల్లా ఎస్‌పిగా ఓ మహిళా అధికారి బాధ్యతలు చేపట్టడంపై ప్రజల్లోనూ, పోలీస్ సిబ్బందిలోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మహిళల పట్ల జరిగే ఘటనలు, సమస్యలకు అధిక ప్రాధాన్యతిస్తామని తెలిపారు. దీంతో విధులపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సచివాలయ మహిళా పోలీసులు తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 938 గ్రామ, 207 వార్డు మొత్తం 1165 సచివాలయాలున్నాయి. ప్రతిసచివాలయంలోనూ మహిళా పోలీస్‌గా ఉన్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం వీరికి జాబ్‌ఛార్ట్‌లో కేటాయించిన విధులకు, ప్రస్తుతం వీరు చేస్తున్న పనికి ఏమాత్రమూ సంబంధం లేకుండా పోయింది. గ్రామసంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా మార్చుచేసేందుకు ప్రభుత్వం జిఒ 59ను తీసుకొచ్చింది. పోలీస్ ఉద్యోగాల నియామక నిబంధనల ప్రకారం ఇది పూర్తి విరుద్ధమని కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి ఫిజికల్ పరీక్షల్లో పాస్‌కాకుండా గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా ఏవిధంగా నియమిస్తారంటూ కోర్టులో వాదనలు సైతం నడిచాయి. దీంతో 59 జిఒను ఉపసంహరించుకున్నట్లు ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. మహిళా పోలీసులకు బందోబస్తు వంటి విధులు వేయాలని కోర్టుకు అఫిడవిట్ రూపంలో సమర్పించడమూ జరిగింది. ఈ జిఒను ఉపసంహరించుకున్నా స్టేషన్ అధికారులు మాత్రం నిబంధలనకు విరుద్ధంగా మహిళా పోలీసులకు విధులు కేటాయిస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే పలుచోట్ల స్టేషన్ అధికారులు కక్షసాధింపు చర్యలకు దిగుతున్నట్లు మహిళా పోలీసులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. నిబంధనల ప్రకారం మహిళా పోలీసులు గ్రామ సచివాలయ పరిధిలో నేరాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌లకు ఇవ్వడం, మహిళలకు సంబంధించిన కేసులు సచివాలయ పరిధిలో జరిగితే హాజరుకావడం, సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించడం, ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు, తమ పరిధిలోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడం వంటివి చేయాల్సి ఉంది. సచివాలయంలో పనిచేసే 11 శాఖల ఉద్యోగులకు వర్తించే నిబంధనలు మాత్రమే వీరికి వర్తిస్తాయి. పోలీస్‌శాఖకు సంబంధించిన నిబంధనలు వీరికి వర్తించవు. మహిళా పోలీసులకు బందోబస్తు, అర్ధరాత్రి వరకూ విధులు, సెలవు, పండుగ రోజుల్లో విధులు కేటాయించడం అనేది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. అందుకు విరుద్ధంగా వీరికి పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్ విధులు, 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహిళా పోలీసులను సిఎం బందోబస్తుకు, ఉద్యోగరాత పరీక్ష కేంద్రాల వద్ద విధులు, అర్ధరాత్రి వరకూ విధులు వేస్తున్న పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల కేసు ఫైల్స్ రాసే బాధ్యతను కూడా మహిళా పోలీసులకే అప్పగిస్తున్నట్లు తెలుస్తోంది. తమ జాబ్‌చార్ట్‌కు విరుద్ధంగా విధులు నిర్వహించలేక మహిళా పోలీసులు నరకయాతన అనుభవిస్తున్నారు. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

ఎస్‌పిగా మహిళా అధికారి రావడంతో ఆశలు

ఏలూరు జిల్లా పోలీస్‌బాస్‌గా మహిళా అధికారి రావడంతో జిల్లాలో పనిచేసే మహిళా పోలీసుల్లో తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకారమే మహిళా పోలీసులకు విధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని వారంతా వేడుకుంటున్నారు. ఏలూరు జిల్లాలో ఇది అమలైతే ప్రభుత్వానికి సైతం మంచి పేరు వచ్చే అవకాశం ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గ్రామసచివాలయ ఉద్యోగ నిబంధనల ప్రకారం మహిళా పోలీసులకు విధులు అమలయ్యేలా చర్యలు తీసుకుంటే ఎంతోమంది మహిళా పోలీసులకు మహిళా అధికారిగా ఊరట కలిగించిన పరిస్థితి ఉంటుంది.

అందరి మదిలోనూ నాటి సంఘటన

జిల్లా ఎస్‌పిగా బాధ్యలు చేపట్టిన మేరీప్రశాంతికి మంచి పోలీస్ అధికారిగా పేరుంది. ఆమె ట్రైనీ డిఎస్‌పిగా ప్రస్తుతం ఉన్న ఏలూరు జిల్లాలోనే పనిచేశారు. ఆమె పనిచేసిన కాలంలో జరిగిన ఘటనలు అందరూ గుర్తుచేసుకుంటున్నారు. ఆమె డిఎస్‌పి శిక్షణలో భాగంగా ఏలూరు టూ టౌన్‌లో పనిచేశారు. అదే సమయంలో అక్కడి సిఐ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆ బాధ్యతలను కూడా ఆమె చూసేవారు. మంచి అధికారిగా పేరు సైతం తెచ్చుకున్నారు. కొద్దిరోజుల తర్వాత సిఐగా మరో అధికారిని నియమించారు. ఆ కుర్చీలో శిక్షణ డిఎస్‌పిగా ఉన్న మేరీప్రశాంతి కూర్చోవడాన్ని ఆయన సహించలేకపోయారు. ఆమెను ఏమాత్రమూ సంప్రదించకుండా తన రాజకీయ పలుకుబడిని ప్రయోగించి ఆమెను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నించారు. అయితే ఆమె ఏ మాత్రమూ తగ్గకుండా గట్టిగా నిలబడ్డారు. ఇప్పుడు ఎస్‌పిగా మేరీప్రశాంతి రావడంతో అప్పటి పరిస్థితులను గుర్తు చేసుకుంటున్నారు. మహిళా అధికారిగా నాడు ఆమె చూపిన ధైర్యం, తెగువ ఎంతోమంది మహిళా అధికారులకు స్ఫూర్తిగా నిలిచింది. ఎస్‌పిగా మహిళలు, మహిళా సిబ్బంది సమస్యపై మరింత దృష్టిసారించాలని అంతా కోరుతున్నారు.

స్పందించకుంటే గద్దె దింపుతాం

రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగుల హెచ్చరిక

భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా

తరలివచ్చిన ఉద్యోగులు, పెన్షనర్లు



ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు, పెన్షనర్లు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతుంటే ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని, ప్రభుత్వం కళ్ళు తెరవకపోతే రాబోయే రోజుల్లో గద్దె దింపుతామని ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీర్ఘకాలంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ తమపై కక్షపూరితంగా వ్యవహరించడంతోపాటు ఉద్యోగులతో తమకు సంబంధం ఏంటి అన్న చందంగా ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో పాటు తమ కుటుంబ సభ్యులు కలిపి రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల మంది ఉన్నామని తామంతా తలుచుకుంటే ప్రభుత్వాన్ని నామరూపాలు లేకుండా చేస్తామని ముక్తకంఠంతో హెచ్చరించారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రెండో దశ ఉద్యమాన్ని ఉద్యోగులు చేపట్టారు. దీనిలో భాగంగా భీమవరం కలెక్టరేట్ వద్ద బుధవారం నిర్వహించిన ధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు వందలాదిమంది తరలివచ్చారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో టెంట్ ఏర్పాటు చేసుకుని బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పటికైనా తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం మరింత తీవ్రతరం దాల్చుతుందని హెచ్చరించారు. తాము ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, న్యాయమైన సమస్యలను మాత్రమే పరిష్కరించాలని కోరుతున్నామని అయితే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కృష్ణమోహన్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.జేమ్స్‌గ్నానియేలు, సెక్రటరీ ఎస్.సత్యనారాయణరాజు, కో ఆపరేటివ్ అసోసియేట్ ప్రెసిడెంట్ జి.వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పాలకొల్లు నాయకులు అజయ్ కుమార్, ఎపి జెఎసి అమరావతి జిల్లా ప్రెసిడెంట్ శివ శంకర్, కార్యదర్శి ఫణి, ఎపిఎన్‌జిఒ జిల్లా కార్యదర్శి ప్రసాదరాజు, కలెక్టరేట్ సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్, పి.సాంబశివరావు, కె.సురేష్, సిబ్బంది, బుజ్జయ్య, సూర్యకాంతం, సత్యనారాయణ, వెంకట రత్నం వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బిజెపి ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాలి

14 నుంచి సిపిఎం, సిపిఐ ప్రచార భేరి - వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో నేతలు

ప్రజాశక్తి - భీమవరం

బిజెపి ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలను ఎండగట్టి, దేశాన్ని కాపాడుకుందామనే నినాదంతో ఈనెల 14 నుండి సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రచారభేరి పోస్టర్‌ను బుధవారం మెంటేవారితోటలోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం, సిపిఐ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ దేశానికి కాపలాదారుగా ఉంటానని ఎన్నో మోసపూరితమైన మాటలు చెప్పి ప్రధాని మోడీ దేశాన్ని కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో సాధించుకున్న ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, ఆదానీలకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నిత్యావసర ధరలను నియంత్రిస్తాం, రైతాంగాన్ని ఆదుకుంటాం, స్వర్ణ భారతాన్ని సాదిస్తాం అని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్ల కాలంలో అభివృద్ధి సూచీలో దేశాన్ని అట్టడుగుస్థాయికి తీసుకెల్లిన ఘనత మోడీదేనన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశ లౌకికతత్వాన్ని దెబ్బతీస్తూ అట్టడుగు వర్గాలవారిపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి రైల్వేజోన్, కడపలో స్టీలు ప్లాంటు ఇస్తామని నేడు నోరు మెదపడంలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. నిర్వాసితులను ఆదుకోలేదని మండిపడ్డారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టి మోడి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోలు, డీజిల్ ధరలు, నిత్యావసర వస్తువులు, ఎరువుల ధరలు, ప్రజల ఔషధాల ధరలను పెంచి, జిఎస్‌టి తీసుకువచ్చి ప్రజల వస్త్రాల ధరలు, ఎలక్ట్రికల్ గూడ్స్ వస్తువుల ధరలు, అన్ని వస్తువుల ధరలను చివరకు స్కూలు పిల్లల రాసుకునే పెన్నులపై జిఎస్‌టి భారాలు వేయడం దారుణమన్నారు. ప్రచారభేరీలో ప్రజలంతా పాల్గొనాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, ఎస్.పుష్పకుమారి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి : సిపిఎం

గణపవరం: రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. బుధవారం పిప్పర ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి పార్టీ మండల కమిటీ నాయకులు నరాలశెట్టి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో బలరాం మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమవుతున్న సమయంలో ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సొమ్ములు వెంటనే రైతుల ఖాతాలో జమచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్నిచోట్ల వరి పంటకు చివరిదశ సాగునీటి అవసరం ఉందని అలాంటి చోట్ల నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 14 నుండి 20వ తేదీ వరకూ బిజెపి మతోన్మాద అజెండాను ఎండగడుతూ జిల్లాలో అన్ని మండలాల్లో రాజకీయ ప్రచారాలు నిర్వహిస్తామన్నారు. మండలంలో 25 గ్రామాల్లో రాజకీయ ప్రచారం నిర్వహించి ప్రతీఇంటికి కరపత్రాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నరసింహమూర్తి, నాయకులు చిన్నం చిన్ననాగేశ్వరరావు, ఎస్.సంజీవరావు, ఎం.పెంటారావు, పి.గోవిందు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

తణుకురూరల్: చట్ట ప్రకారం ఉన్న యూనియన్ కార్మికులను తొలగించి, పోటీ కార్మికులతో పనిచేయించడం అన్యాయమని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. ఎపి సీడ్స్‌లో టెండర్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై స్పందించాల్సిన కార్మికశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. నేటికీ కార్మికులకు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా తొలగించడం బాధాకరమన్నారు. కార్మికులు శాంతియుతంగా పోరాడుతున్నప్పటికీ సీడ్స్ అధికారులు మొండిగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.రామకృష్ణ, జి.త్రిమూర్తులు, సాంబశివరావు, రమణ, వైటి.రామకృష్ణ, టి.వెంకటేశ్వరరావు, గార రంగారావు, బి.శ్రీహరి పాల్గొన్నారు.

తమది రైతు ప్రభుత్వం : మంత్రి కొట్టు

గూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తమది రైతు ప్రభుత్వమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలం పట్టింపాలెం గ్రామంలో జిల్లాలో తొలిసారిగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గ్రామ గ్రామాన రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయ రంగానికి అవసరమైన అన్నింటినీ తీరుస్తున్నారన్నారు. నిరంతరం 9 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే జగనన్న వ్యవసాయం పండుగ అని నిరూపించారన్నారు. ముఖ్యమంత్రి జగన్ రైతుల నుంచి మద్దతు ధరకు సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు డబ్బులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా గోనె సంచులు, హమాలీ రవాణా ఛార్జీలను సైతం ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. మొక్కజొన్న బయట మార్కెట్లో 1200 రూపాయలు ఉంటే ప్రభుత్వం 1600 రూపాయలకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. గత సార్వాలో జిల్లాలో 65660 మంది రైతుల నుంచి 3,76 వేల 657 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇందులో ఒక తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి 85 వేల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శివరామ ప్రసాద్ మాట్లాడుతూ దాళ్వాలో జిల్లాలో స్థానిక అవసరాలు పోను 8.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని దానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా సహకార అధికారి రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో 378 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ ఎద్దుల బండ్లకు సైతం రవాణా ఛార్జీలు చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, కొమ్ముగూడెం సొసైటీ ఛైర్మన్ వెలిశెట్టి నరేంద్ర కుమార్, సెక్రటరీ శర్మ, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ముప్పిడి వెంకట్రామి రెడ్డి పాల్గొన్నారు.

తణుకు ఆసుపత్రిలో అన్నిసేవలూ అందించాలని సిపిఎం ధర్నా

తణుకురూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు కావాల్సిన అన్ని రకాల వైద్యసేవలు అందించాలని, రిస్ట్రక్చర్ పేరుతో తొలగించిన వైద్యులను, సిబ్బందిని కొనసాగించాలని సిపిఎం పట్టణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక జిల్లాకేంద్ర ఆసుపత్రి వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.శివప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రిలో అన్నిరకాల వైద్యసేవలందించాలని, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని, ఆసుపత్రి విస్తరణకు కావాల్సిన స్థలం వెంటనే సేకరించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా పేదలకు నాణ్యమైన వైద్యం నేటికీ అందడం లేదన్నారు. తణుకులో ఉన్న ఏరియా ఆసుపత్రి జిల్లా ఆసుపత్రిగా మారినా నేటికీ పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బంది లేరని విమర్శించారు. ఏ ఆసుపత్రికైనా మత్తు ఇచ్చే వైద్యులు చాలా ముఖ్యమని అలాంటిది ముగ్గురికి నేడు ఒక్కరే పని చేయడం వల్ల ఏమర్జెన్సీ సమయంలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. చాలా వార్డుల్లో సిబ్బంది లేక రోగులకు సరైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్కన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పుడు జిల్లా ఆసుపత్రిలో ఎందుకు సౌకర్యాలు కల్పించడం లేదని ప్రశ్నించారు. జిల్లా ఆసుపత్రి విస్తరణ కోసం, స్థలం కోసం వెంటనే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న మంత్రి, అధికారులు ఆసుపత్రిలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, పి.దక్షిణామూర్తి, పిఎల్.నరసింహారావ, బి.శ్రీహరి, శింగులూరి సత్య నారాయణ, టి.వెంకటేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

బసవపున్నయ్య జీవితం స్ఫూర్తిదాయకం

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం



బసవపున్నయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

సమసమాజ స్థాపన కోసం జీవితాన్ని ధారపోసిన మాకినేని బసవపున్నయ్య జీవితం స్ఫూర్తిదాయకమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. మాకినేని బసవపున్నయ్య వర్ధంతి స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బలరాం మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో అగ్రశ్రేణి నాయకుల్లో బసవపున్నయ్య ఒకరున్నారు. గుంటూరు జిల్లాలో పుట్టిన బసవపున్నయ్య విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకున్నారన్నారు. బ్రిటిష్ వారికీ వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్యోద్యమంలో విద్యార్థి ఉద్యమ నాయకుడిగానే పాల్గొన్నారన్నారు. చిన్న వయసులోనే దేశభక్తితో పాటు ప్రజల కష్టాలన్నీ తీర్చాలని, సమసమాజం రావాలనే ఉన్నత ఆశయాలను ఆయన తన మదినిండా నింపుకున్నారన్నారు. ఆంధ్ర రాష్టంలో విద్యార్థి ఉద్యమంలో, యువజనోద్యమంలో, కమ్యూనిస్టు సభ్యుడిగా, ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో పేరెన్నిక గన్న నాయకుల్లో ఒకరున్నారు. కమ్యూనిస్టు పార్టీ విడిపోయిన తర్వాత 1964లో సిపిఎం తొలి పొలిట్ బ్యూరోలో నవరత్నాల్లో ఒకరిగా బసవపున్నయ్య ఉన్నారన్నారు. బసవపున్నయ్య ఆశించిన సమసమాజ స్థాపన కోసం, సామాజిక న్యాయం కోసం, పేదవాడికి భూమి, దేశ సంపద ప్రజలకే చెందడం అనే ఆశయాల కోసం సిపిఎంగా అందరం పునరంకితమై పని చేస్తామనిన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, పట్టణ కమిటీ సభ్యులు నాగు, చైతన్య ప్రసాద్, సత్యనారాయణ, బంగారు లక్ష్మి, రత్నకుమారి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు తోడ్పడాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు తోడ్పాటునివ్వాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సిఎస్‌ఆర్ ఫండ్స్ వినియోగంపై జిల్లాలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి పరిశ్రమ వారి వార్షిక ఆదాయంలో రెండు శాతం నిధులను విద్య, వైద్యం, తదితర మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించాల్సి ఉందన్నారు. ఇప్పటికే కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు స్వచ్ఛందంగా ఖర్చు చేస్తున్నాయని, వినియోగిస్తున్న నిధులు పనుల వివరాలు జిల్లా యంత్రాంగానికి తెలియజేయకపోవడం, దుర్వినియోగం జరుగుతోందన్నారు. పరిశ్రమల యాజమాన్యం సిఎస్‌ఆర్ ఫండ్స్ ద్వారా చేపట్టే పనుల వివరాలను ముందస్తుగా జిల్లా యంత్రాంగానికి తెలియజేసి ఆమోదం పొందాలని సూచించారు. జిల్లా యంత్రాంగం ఆమోదంతో చేసే నిధుల వినియోగానికి సెక్షన్ 80జి సర్టిఫికెట్ కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఒ బి.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఉయ్యాల ఆదిశేషు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ కె.వెంకటేశ్వర్లు, భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎ.లక్ష్మి, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

నేటి పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత అందరిపైనా ఉందని ఆచంట మాజీ ఎంఎల్‌ఎ, కెవిపిఎస్ జిల్లా నాయకులు దిగుపాటి రాజగోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేద్కర్ భవనంలో జరిగిన రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో ముఖ్యవక్తగా ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం అందరికీ ప్రాథమిక హక్కులను కల్పించిందన్నారు. ప్రస్తుతం దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపి రాజ్యాంగంలోని ఫెడరల్ ప్రజాస్వామిక లౌకికసామాజిక సమానత్వపు విలువలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశంలో దళితులపై దాడులు పెరిగాయన్నారు. దేశంలో లౌకిక విలువలు పెంపొందించడానికి ప్రజాస్వామ్యవాదులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక నిర్వాహకులు ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని మౌలిక అంశాలు ఆదర్శనీయమని, వాటిని కాపాడుకోవాలని తెలిపారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వాలు నిష్పక్షపాతంగా అమలు చేయాలన్నారు. సామాజిక న్యాయాన్ని ఓట్ల కోసం కాకుండా చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చదలవాడ జ్ఞాన ప్రకాష్ సోడదశి శ్రీధర్, సామాజిక నాయకులు కట్ట గోపాలకృష్ణ ఎస్‌సి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తడి నాగభూషణం, రీతై బాబూరావు, మత్స్యకార సంఘం నాయకులు జల్లి రామ్మోహన్‌రావు, ఆవాజ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి

భీమవరం రూరల్: ధాన్యం కొనుగోలులో ప్రయివేటు వ్యక్తులు, మిల్లర్లు రైతులను మోసం చేస్తున్నారని ఇకనుండి రైతుభరోసా కేంద్రాలు ద్వారానే ధాన్యం కొనుగోలు చేయాలనే నిబంధనలు తీసుకొచ్చిన ప్రభుత్వం తిరిగి ప్రయివేటువ్యక్తులు, మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసేలా సడలింపు ఇవ్వడం దారుణమని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తుందుర్రులో పొలాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గతంలో ప్రయివేటు వ్యక్తులు ప్రతిబస్తాకు రూ.వంద నుండి రూ.200 వరకూ తగ్గించి కొనుగోలు చేయడంతో రైతులకు ప్రభుత్వ మద్దతు ధర దక్కడంలేదని ఇక నుంచి ఆర్‌బికెల ద్వారా మాత్రమే ధాన్యం అమ్మాలని చెప్పిన ప్రభుత్వం దానికోసం తేమశాతం మిషన్, ఇతర పరికరాల కోసం సహకార సొసైటీల ద్వారా లక్షలాది రూపాయలు ఖర్చు చేయించిందని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లోనే మిల్లర్లు తేమశాతం అదనంగా చూపించి కౌలురైతుల వద్ద వేలాది రూపాయలు దోచుకున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు, రైతుల ధాన్యం ఎక్కడైనా అమ్ముకోవచ్చని ప్రచారం చేస్తున్న ఆచరణలో బ్రోకర్లు, మిల్లర్లు దోచుకోవడానికి వీలుకల్పించడమేనని విమర్శించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కోయ పెద్దిరాజు, కౌలురైతులు వెంకటేశ్వరరావు, పోతురాజు, జక్కరయ్య, మెట్టి శ్యామ్‌సుందరం పాల్గొన్నారు.

28న ధర్నా జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఉపాధి కూలీల పనిప్రదేశాల్లో పర్యటనలో భాగంగా బుధవారం తాడేపల్లిగూడెం మండలం లింగారెడ్డిగూడెంలో ఉపాధి పని ప్రదేశంలో పర్యటించి కూలీలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు, వ్యవసాయం కార్మిక సంఘం మండల కార్యదర్శి కండెల్లి రమేష్‌బాబు మాట్లాడారు.

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి

కాళ్ల: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి తిరిగి అధికారం చేపట్టాలని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. దొడ్డనపూడి గ్రామంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే అన్ని తరగతుల ప్రజలకూ న్యాయం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆపదలో ఉన్నవారికి, పేదలకు సహాయం చేయడం మానవ ధర్మమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. భీమవరం 4వ వార్డు నరసయ్య అగ్రహారానికి చెందిన ఆత్రగడ్డ పెద్దింట్లు 20 నెలల్లో తండ్రి, తల్లి, అన్నను కోల్పోయింది. బాధిత కుటుంబానికి బుధవారం రాష్ట్ర కృష్ణ బలిజ సాధికారిక సంఘం సభ్యులు గంటా త్రిమూర్తులు రూ.11 వేల ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మామిడిశెట్టి ప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, వైస్ ప్రెసిడెంట్ లంకి శ్రీనివాస్, మద్దుల రాము పాల్గొన్నారు.

ఆచంట తహాశీల్దార్‌గా సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట తహాశీల్దార్‌గా ఎస్‌వి.సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కలెక్టర్ కార్యాలయం నుంచి ఉద్యోగోన్నతిపై ఆచంట వచ్చారు. ఈ సందర్భంగా కార్యాల సిబ్బంది సుబ్రహ్మణ్యంకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

జివికె స్టోరీజీల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యా కానుక పూర్తిస్థాయిలో అందేలా చూడాలని రాష్ట్ర పాఠ్యపుస్తక అభివృద్ధి అధికారి (స్టేట్ అబ్జర్వర్) డి.మాధవిలత అన్నారు. బుధవారం జగనన్న విద్యా కానుక స్టోరీజీల భద్రతపై సిఆర్‌పి, పిటిఐలకు ఎంఇఒ కార్యాలయంలో ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ మండలంలోని సిఆర్‌పి, పిటిఐ సమిష్టి కృషి చేసి విద్యా కానుక సామగ్రిని విద్యార్థులకు పూర్తిగా అందించాలన్నారు. జిల్లాలోని 19 మండలాల్లోని 19 కేంద్రాల్లో స్టోరేజీలను పరిశీలించినట్లు తెలిపారు. గతంలో విద్యా కానుక అందించినట్లు కాకుండా, వచ్చే ఏడాది ప్రతి విద్యార్థికీ బ్యాగు, దుస్తులు, పుస్తకాలు స్కూలు ప్రారంభానికి పది రోజులు ముందుగానే అందుబాటులో ఉంచుతామన్నారు. అంతేకాకుండా పాడైన విద్యా కానుకను విద్యార్థికి మార్పు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎకనామిక్ మోనిటరింగ్ ఆఫీసర్ (ఎఎంఒ) ఎంఎన్ శ్రీమన్నారాయణ, సిఎంఒ ఎ.రామకోటేశ్వరరావు, ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న, పెనుమంట్ర హైస్కూల్ హెచ్‌ఎం కె.సాయి సూర్యనారాయణరావు పాల్గొన్నారు.

పాలకోడేరు:జగనన్న విద్యా కానుక కిట్ల భద్రత విషయంలో మండల స్థాయి అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర పాఠ్యపుస్తక అభివృద్ధి అధికారి డి.మాధవీలత అన్నారు. పాలకోడేరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ల నిల్వ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులందరికీ ఒకే దఫాలో విద్యా కానుక కిట్లను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కిట్ల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించి సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలన్నారు. సమావేశంలో ఎఎంఒ ఎంఎన్.శ్రీమన్నారాయణ, సిఎంఒ ఎ.రామకోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు పి.మహేష్‌బాబు, ఎంఇఒ పి.రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండి

మహదేవపట్నం గ్రామ పంచాయతీ పరిధిలోని ఉప్పరగూడెంలో ఐదు లక్షల రూపాయల ఎంపీ నిధులతో వేయబోతున్న 73 మీటర్ల సిమెంట్ రోడ్డుకు బుధవారం ఎంఎల్‌ఎ మంతెన రామరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులకు తన వంతు సహాయం అందించిన నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహదేవపట్నం గ్రామ అధ్యక్షులు వనిమా శ్రీనివాస్, ఎంపిటిసి బొక్క వీరబాబు, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు వత్సవాయి నాగ సుజాత పాల్గొన్నారు.

భీమవరంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎఎస్ఎన్ రాజు ఛారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పుష్ప రాజ్ మాట్లాడుతూ మాలమహానాడు ఆధ్వర్యంలో ఉద్యమాలు, సేవా కార్యక్రమాలతో పాటు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలని, ఎఎస్‌ఎన్.రాజు ఛారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ ఎఎస్ఎన్ రాజు ఆలోచన మేరకు ఆచరణలో పెట్టామని తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు రక్తం అందుబాటులో ఉండేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు నేతల సువర్ణరాజు, భీమవరం మండల అధ్యక్షులు దాసరి చిరంజీవి, నేతల సాల్మన్‌రాజు ఉన్నారు.

జిల్లా కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయండి

విఆర్‌ఒల సంఘం మండల అధ్యక్షుడు చిన్నారావు

ప్రజాశక్తి - ఉండి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని విఆర్‌ఒల సంఘం మండల అధ్యక్షులు సైదాడ చిన్నారావు పిలుపునిచ్చారు. బుధవారం ఉండిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆకివీడు యూనిట్ సభ్యులు కెనడీ, దానయ్య, సురేష్, కోటేశ్వరరావు, అంజిబాబు సమక్షంలో విఆర్‌ఒల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ జిల్లా కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల గురించి పలు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ సమావేశాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దాసు, బాలకృష్ణ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

14న పెనుమదం నుంచి ప్రాదయాత్ర

ప్రజాశక్తి - పోడూరు

ఈనెల 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని పెనుమదం గ్రామంలో ఉదయం ఎనిమిది గంటలకు శివాలయం దగ్గర నుంచి పాదయాత్ర ప్రారంభమై మట్టపర్రు, బొల్లేటిగుంట, వేడంగి మీదుగా వేడంగిపాలెంలోని అంబేద్కర్ విగ్రహం వరకూ కొనసాగుతుందని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యఅతిథిగా మాజీ పీతల సుజాత, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ కూడా ఈ పాదయాత్రలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ యాత్రలో నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భూసార పరీక్షలపై శిక్షణ

ప్రజాశక్తి - కాళ్ల

వరి పొలంలో భూసార పరీక్షలు నిర్వహించేందుకు మట్టి నమూనాలు సేకరించాలని ఆకివీడు ఎడిఎ ఎస్‌ఎస్.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కాళ్ల మండల వ్యవసాయ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు భూసార పరీక్షలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎడిఎ ఎస్‌ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎరువులు మోతాదును ఎలా నిర్ణయిస్తారనే దానిపై, మట్టి నమూనా సేకరణను చూపించేందుకు ఫీల్డ్ లెవల్‌లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కెఎస్‌ఎస్.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి సి.జయవాసుకి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పెనుగొండ

సిద్ధాంతం చెరువు పేట లూథరన్ చర్చిలో అంబేద్కర్ జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు కెవిపిఎస్ జిల్లా నాయకులు కప్పల రత్నరాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కప్పల రత్నరాజు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం ఉండే అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్లే సురేష్, కత్తుల మణి బాబు, రొక్కాల ధనరాజు పాల్గొన్నారు.

ఈ ఏడాది 1.69 పని దినాల లక్ష్యం

ఉపాధి హామీ మండల టెక్నికల్ అసిస్టెంట్ పి.జయబాబు

చిట్‌చాట్



ప్రజాశక్తి - పాలకోడేరు

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని చట్టం మండల టెక్నికల్ అసిస్టెంట్ పిల్లిచిట్టి జయబాబు అన్నారు. గతేడాది తీసుకున్న లక్ష్యానికి మించి కూలీలకు దినాలు కల్పించడంతోపాటు వేతనాలు పూర్తిస్థాయిలో అందించామన్నారు. ఇదే సంకల్పంతో ఈ ఏడాది ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం నిర్వహణ, జరుగుతున్న పనులు, కూలీలకు కల్పిస్తున్న పనిదినాలు, అందిస్తున్న వేతనాలపై ప్రజాశక్తి నిర్వహించిన చిట్‌చాట్‌లో వివరించారు.

ప్రశ్న : మండలంలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి?

మండలంలో 14 గ్రామాలు ఉన్నాయి. కొండేపూడిలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్ భర్తీ కావాల్సి ఉంది. మిగిలిన 13 గ్రామాల్లో సుమారు 5,814 జాబ్ కార్డులు ఉన్నాయి.

ప్రశ్న : రోజుకు ఎంతమందికి పని కల్పిస్తున్నారు?

కొన్ని గ్రామాల్లో పనుల నిర్వహణకు ప్రతిపాదనలు చేశాం. మిగిలిన గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. రోజుకు సరాసరి వెయ్యి మందికిపైగా పని దినాలు కల్పిస్తున్నాం.

ప్రశ్న : ప్రస్తుతం ఏయే పనులు జరుగుతున్నాయి?

ప్రస్తుతం పంట కాలువ, బోదేల్లో పూడిక పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో వర్క్ ఆర్డర్స్ రావాల్సి ఉంది. 24 పనులకు ప్రతిపాదనలు చేశాం. వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

ప్రశ్న : రోజుకు ఎంత వేతనం చెల్లిస్తున్నారు?

రెండు పూటలా పని దినాలు అమలు చేస్తున్నాం. రోజుకు సరాసరి రూ.272 వరకూ వేతనం చెల్లిస్తున్నాం. ప్రతి కూలికీ నెలకు రూ.7 వేల వరకూ వేతనం సమకూరుతోంది. జరుగుతున్న పనిని బట్టి మస్తర్ల ఆధారంగా వేతనాలు చెల్లించడం జరుగుతోంది.

ప్రశ్న: ఒక జాబ్ కార్డుకు ఎన్ని రోజులు పని కల్పిస్తున్నారు?

జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ సంవత్సరానికి 100 రోజులు పని కల్పిస్తున్నాం. వంద రోజులు పని దినాలు పూర్తయితే జాబు కార్డు కలిగిన కూలికి పనులు కల్పించడం జరగదు.

ప్రశ్న : ఈ ఏడాది ఎంత మేర లక్ష్యం తీసుకున్నారు?

గతేడాది లక్షా55 వేల పని దినాలు కల్పించాం. దీనికి గాను సుమారు రూ.ఐదు కోట్ల చెల్లింపులు చేశాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసిన నేపథ్యంలో ఈ ఏడాది లక్షా 69 వేల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా తీసుకున్నారు. దీనికి గాను రూ.4 కోట్ల 59 లక్షల 68 వేలు చెల్లించే విధంగా లక్ష్యం నిర్దేశించాం.

ప్రశ్న : పని దినాలు ఏవిధంగా అమలు చేస్తున్నారు?

ప్రస్తుతం రోజుకు రెండు పూటలా పని అమలు జరుగుతోంది. ఉదయం ప్రారంభించాక ఒక ఫొటో తీసిన తర్వాత ఐదు గంటలు గడిచాక మళ్లీ తిరిగి మరో ఫొటో తీస్తాం. ఇలా రెండు పూటలా చేసిన పనిని ఆధారం చేసుకుని ఒక రోజు పని దినంగా నిర్ణయించడం జరుగుతుంది.

ప్రశ్న : వేసవి నేపథ్యంలో పని ప్రదేశాల వద్ద ఏమైనా చర్యలు చేపట్టారు?

పని ప్రదేశాల వద్ద చర్యలు తీసుకోమని జిల్లా అధికారుల నుంచి ఇంకా ఆదేశాలు అందలేదు. మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మెడికల్ కిట్ తీసుకోవాలని ఆదేశాలు అందాయి. ఈ మెడికల్ కిట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : వేతనాలు ఎప్పటిలోగా చెల్లిస్తున్నారు?

కూలీలు పనిచేసిన మూడు రోజుల్లో మస్తర్ల ఆధారంగా ఎంటర్ చేయడం జరుగుతుంది. 15 రోజుల్లో వేతనాలు చెల్లించడం జరుగుతుంది.

ప్రశ్న : తాగునీటి చెరువుల పూడిత పనులు ఏమైనా జరుగుతున్నాయా?

అమృత సర్వర్‌లో భాగంగా తాగునీటి చెరువుల పూడిత పనులు కొన్ని గ్రామాల్లో జరుగుతున్నాయి. గొల్లలకోడేరు బ్రాహ్మణచెరువు, గొరగనమూడి చెరువుల పనులు ప్రారంభించాల్సి ఉంది. శృంగవృక్షం బంటుమిల్లిచెరువు పూడిక తీత పనులు పూర్తవ్వడం జరిగింది. గ్రామ పంచాయతీలు పూడికతీత పనులకు సంబంధించి తీర్మానాలు అందిస్తే పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం : ఎంఎల్‌ఎ



ఆచంట రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంఎల్‌ఎ రంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

ప్రజా సమస్యల పరిష్కారమే వైసిపి ప్రభుత్వం ధ్యేయమని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట పంచాయతీ పరిధి పోర కాలనీలో నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీలో త్వరలోనే అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రధానంగా ఈ కాలనీలో రహదారి సౌకర్యం లేక ఆ కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా వర్షం వస్తే కాలనీ అంతా బురదమయం అవుతోందని తెలిపారు. ఈ సందర్భంగా ఆ కాలనీకి రూ.50 లక్షలు రహదారుల నిమిత్తం మంజూరు చేసి భూమి పూజచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలో రహదారులతోపాటు, విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి అడ్డాల పెద్దిరాజు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు, సత్యనారాయణ, కుక్కల కిరణ్‌కుమార్, అప్పారావు పాల్గొన్నారు.

ఉండి:పారదర్శక పాలన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమని యండగండి గ్రామ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి అన్నారు. బుధవారం యండగండి గ్రామంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీసి స్టిక్కర్లు అంటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జన్మభూమి కమిటీలు వేసి కేవలం టిడిపి కార్యకర్తలకే ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత పార్టీలకతీతంగా పారదర్శకంగా వాలంటీర్లను నియమించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. గృహ సారథులు, వాలంటీర్లు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వేగేశ్న వేణు, టోనీ బాబు, ప్రసంగి, గోపాలకృష్ణమూర్తి, బొడ్డు సూరమ్మ పాల్గొని ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని చింతపర్రు, ఆగర్తి పాలెం గ్రామాలలో జగనే మా భవిష్యత్తు కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు పాల్గొన్నారు. ప్రతి ఇంటికి తిరిగి లబ్ధిదారులతో మాట్లాడారు. అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి వారితో చర్చించి సలహాలు సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో చిట్టూరి ఏడుకొండలు, వైస్ ఎంపిపి పడవల సునీల్, చింతపర్రు సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు పాల్గొన్నారు.



ఉండి : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచి కృష్ణమూర్తి

గూడెంలో వెటర్నరీ అంబులెన్స్ ప్రారంభం

తాడేపల్లిగూడెం:ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గొప్ప మానవత్వం ఉన్న వ్యక్తి అని ఉపముఖ్యమంత్రి, దేవదాయ ధర్మదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని పట్టింపాలెంలో బుధవారం వెటర్నరీ అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా క్షతగాత్రులను తక్షణం ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడేందుకు 108 అంబులెన్స్ ప్రారంభించారని గుర్తుచేశారు. నేడు జగన్మోహన్ రెడ్డి 108 అంబులెన్స్‌లను పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు వైద్యం మరింత చేరువ చేసేందుకు 104 అంబులెన్స్‌లను ప్రవేశ పెట్టారన్నారు. మూగజీవాల కోసం హెల్ప్ లైన్ 1962 పేరుతో వెటర్నరీ అంబులెన్స్‌ను తీసుకొచ్చారన్నారు. కేవలం మనుషుల గురించి మాత్రమే కాకుండా మూగజీవాల గురించి సైతం ఆలోచించిన గొప్ప మానవత్వం కలిగిన మానవతామూర్తి జగన్ అన్నారు. కార్యక్రమంలో భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, డిఎస్‌ఒ ఎన్.సరోజ, సివిల్ సప్లై డిఎం శివరాంప్రసాద్, డిసిఒ రవికుమార్, జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

పాలకొల్లు:పోడూరు మండలం 8 గ్రామాల పరిధిలో నూతనంగా నియామకమైన ముగ్గురు వాలంటీర్లకు పాలకొల్లు వైసిపి కార్యాలయంలో బుధవారం నియామక పత్రాలను జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ అందజేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎంపిపి సుమంగళి, వైస్ ఎంపిపి గుబ్బల సత్యనారాయణ పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న కె.శ్రీనివాస్

ఆలయంలో అదనపు గదులు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక యడ్లబజార్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో దాతల ఆర్థిక సాయంతో నూతనంగా నిర్మించిన అదనపు గదులను జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఆయనకు ఆలయ ఛైర్మన్ కావలి శ్రీనివాస్, ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కెల్ల పెద్దిరాజు, గుండుబోయిన అరుణకుమారి నాగేశ్వరరావు, రేలంగి నరసింహమూర్తి, ఆలయ ఇఒ నల్లూరి సతీష్ కుమార్ స్వాగతం పలికారు.

మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ ఉపయోగకరం

తాడేపల్లిగూడెం:మహిళల కోసం మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకాన్ని భారత తపాలాశాఖ ప్రారంభించినట్లు తాడేపల్లిగూడెం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ సివి రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం మహిళా సాధికారతకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ పథకంలో వెయ్యి రూపాయల నుంచి రూ.రెండు లక్షల వరకూ డిపాజిట్ చేయవచ్చని తెలిపారు. దీనిపై వడ్డీ 7.5 శాతం పొందొచ్చని తెలిపారు. ఈ పథకానికి కాల పరిమితి రెండు సంవత్సరాలని, ఖాతాదారులు డబ్బులు అవసరమైతే డిపాజిట్ మొత్తంలో 40 శాతం ఖాతా తెరిచిన సంవత్సరం తరువాత తీసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. ఖాతాదారుడు ఏదైనా అనారోగ్యం దృష్ట్యా ఖాతా కొనసాగించడం కుదరని పక్షంలో ఖాతాను ప్రీ మెచ్యూర్‌గా క్లోజ్ చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. ఈ ఖాతాను మహిళలు, ఆడపిల్లలు అన్ని వయస్సుల వారు ప్రారంభించవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు దగ్గర లోని పోస్టాఫీసులో తెలుసుకోవచ్చని తెలిపారు.

ప్రయివేటుకు 50 శాతం వాటాలు కట్టబెట్టడం దారుణం

ప్రజాశక్తి - భీమవరం

వ్యవసాయ పరపతి సంఘాల్లో 50 శాతం వాటాలను ప్రయివేటు సంస్థల వ్యక్తులకు కట్టబెడుతూ ప్రభుత్వం 1964 సహకార సంఘాల చట్టాన్ని సవరణ చేయడాన్ని స్టేట్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. భీమవరం డిసిసిబి మెయిన్ బ్రాంచి వద్ద యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.విజయ భాస్కర్‌రావు అధ్యక్షతన బుధవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. సహకార సంఘాలను దెబ్బతీసేందుకు ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో చట్టంలో సవరణ జరిగిందని, ఇది సహకార వ్యవస్థకు తీవ్ర ఇబ్బంది అని సమావేశం పేర్కొంది. మోడీ ప్రభుత్వం దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయాలనే విధానాల్లో భాగంగా ఇప్పటికే బ్యాంకులు, ఇన్సూరెన్స్, రైల్వే, పోర్టు, విమానాశ్రయాలు వంటి సంస్థలను ప్రయివేటీకరణ చేస్తున్నాయని విమర్శించారు. సొసైటీ ఉద్యోగులకు 36 జిఒ ప్రకారం వేతనాలు సౌకర్యాలు వెంటనే అమలు చేయాలని, 2019 ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త వేతన సవరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి పలు దఫాలు విజ్ఞప్తులు ఇచ్చినా పట్టించుకోవటం లేదని సమావేశం ఆరోపించింది. పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచుతూ జిఒ ఇవ్వాలని, తదితర సమస్యలపై ఈనెల 17వ తేదీన కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాకు జిల్లాలోని ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున హాజరుకావాలని సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు కె.రాజా రామ్మోహన్ రాయ్, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణశాస్త్రి, కన్వీనర్ పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ జిల్లాలో డిసిసిబి నుండి ఇటీవల ఆరు శాతం వసూలు ఉత్తర్వులు పైన, ధాన్యం సేకరణలో వస్తున్న ఇబ్బందులు పైన ఉద్యోగులందరూ ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ పరపతి సొసైటీలను మరింత పటిష్టంగా పనిచేసేందుకు జిల్లా అధికారులు కూడా సహకరించాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సొసైటీ ఉద్యోగుల్లో ఐక్యత పెరగాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ట్రెజరర్ ఎన్.పెద్దిరాజు, నాయకులు బొల్లి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం, కె.సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు

4 కేజీల గంజాయి స్వాధీనం

ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు రైల్వేస్టేషన్ వద్ద అక్రమంగా గంజాయి కలిగిన ముగ్గురు యువకులను తణుకురూరల్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సిఐ సిహెచ్.ఆంజనేయులు వివరాలు వెల్లడించారు. నాలుగు రోజుల క్రితం పాడేరులో కొనుగోలు చేసిన గంజాయి తణుకులో విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్ఐ గుర్రయ్య, సిబ్బంది దాడి చేశారని తెలిపారు. సుమారు రూ.20 వేల ఖరీదు చేసే 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల వద్ద పాలమూరు గ్రామానికి చెందిన పంచదార స్నేహ సత్యసాయిఫణి హైదరాబాద్‌లో బిటెక్ చదువుతున్నాడని, పాలకొల్లు మండలం పెంకుళ్లపాడు గ్రామం ఎల్అండ్‌టి కాలనీకి చెందిన కొర్రా తేజ అలియాస్ ఆంబోతు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, పాలకొల్లు పట్టణం భారతీయ విద్యాభవన్స్ వెనుక నివాసం ఉంటున్న ఖండవల్లి జయవెంకటసాయి ఇంటర్మీడియట్ చదువుకున్నాడని తెలిపారు. ఈ ముగ్గురు ఒకే మండలానికి చెందిన స్నేహితులని, జల్సాలకు అలవాటు పడి గంజాయి విక్రయించేందుకు తణుకు ప్రాంతానికి వచ్చి ఉంటారని తెలిపారు. తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రతిభ కనబర్చిన తణుకు సిఐ ఆంజనేయులు, ఎస్ఐ గుర్రయ్య, కానిస్టేబుళ్లు మాధవరావు, అక్బర్, అన్వర్, మహేష్‌ను జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సిఐ ఆంజనేయులు

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరాలపై దాడులు

8 మంది అరెస్టు

ప్రజాశక్తి - ఉండి

పేకాట స్థావరాలపై దాడిచేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న సంఘటన యండగండిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని శ్మశానవాటికలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ కె.గంగాధర్‌రావు సిబ్బందితో బుధవారం పేకాట స్థావరాలపై దాడి చేశారు. ఈ నేపథ్యంలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 24300 రూపాయల నగదు, ఏడు మోటార్ సైకిళ్లు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పాస్‌పోర్టు పోయినది

పెచ్చెట్టి లక్ష్మి, భర్త: శ్రీను అను నేను ఓడూరు నుండి ఆలమూరు పాస్‌పోర్టు జిరాక్స్ కోసం వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబరు **M3560417** గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్: పెచ్చెట్టి లక్ష్మి
భర్త: శ్రీను
ఓడూరు న్యూ కాలనీ,
పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా
సెల్: 9000919952

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాసు మేజిస్ట్రేట్ వారి కోర్టులో
C.C. 104/2022

బిట్వీన్:
1. M/s. G.K. జ్యూయలర్స్ ఇండస్ట్రీస్, రిప్రజెంటెడ్ బై యిట్స్ ప్రొప్రయిటర్, గురజాడ ఆనంద్ కుమార్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
2. శ్రీ గురజాడ ఆనంద్ కుమార్, S/o. కనకారావు, డో.నెం. 5-3-31, శేషమహల్ రోడ్, రామాలయం దగ్గర, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా. ...ఫిర్యాది

మరియు

1. శ్రీమతి కొమ్మోజు దుర్గాదేవి, W/o. లేటు వెంకటరత్నం, రోడ్ నెం.7, బాలాజీ నగర్, వేల్పూరు విలేజ్, తణుకు మండలం, ప॥గో॥జిల్లా. ...ముద్దాయి

పై నెంబరు గ్రంధంలో శ్రీ కోర్టు ద్వారా ముద్దాయికి సమన్లు పంపించినప్పటికి అవి తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ప్రకారం **ది. 19-04-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

అద్దంకి విజయరత్నం, అడ్వకేట్
తాడేపల్లిగూడెం — తాడేపల్లిగూడెం
ది.13-4-2023 — సెల్: 9290188928

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 475/2022

Between:
M/s. Union Bank of India, Branch Tanuku, Rep. by its Chief Manager, Tanuku ...*Plaintiff*
AND
Ankani Ramprasad ...*Defendant*

Defendant:
Ankani Ramprasad, S/o. Sambamurthy, D.No. 2-10, రామాలయం వీధి, వేల్పూరు, తణుకు (మం), ప॥గో॥జిల్లా.

వాది తరపున వేయించిన ప్రకటన

యిందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు దావాలో మీకు సమన్లు కోర్టు ద్వారా పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **ది. 26-04-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షములో దావా విచారణ చేసి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

KAMANA MUNISWAMY
తణుకు — Advocate, Tanuku
ది.10-4-2023 — Cell: 9441447403

ప్రకటన
మహారాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తణుకు కోర్టులో
O.S. No. 523/2021

షోడవరపు పాలేశ్వరి -వాది
ఎదిరి
పోడూరి వెంకట శ్రీనివాసరావు అండ్ 3 అదర్స్ -ప్రతివాదులు

D-4: పోడూరి వెంకట దివ్య, D/o. వెంకట శ్రీనివాసరావు, 27 సం॥లు, ఆంజనేయస్వామి గుడి దగ్గర, ఇరగవరం.

వాది స్థిరాస్తి విభజన కొరకు పై నంబరు దావా దాఖలు చేసుకొనియున్నారు. 4వ ప్రతివాది అయిన మీకు ఎన్నిమార్లు సమన్లు పంపిననూ Avoid చేయుచున్నందున కోర్టు వారు మీ హాజరు నిమిత్తం సదరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయుటకు అనుమతి మంజూరు చేసియున్నారు. కావున **ది. 28-4-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగాను లేక అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీ వాదనను దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయుదురు.

(By Order of the Court)

కర్రి జనార్ధనరెడ్డి, అడ్వకేట్
తణుకు — సెల్: 9397112777

వేలం ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :: నూజివీడు
ఇ.పి.నెం. 53/2016
ఇన్ ఓ.యస్.నెం. 294/2014

బిట్వీన్:
చలసాని భువన సురేంద్ర వెంకట రమేష్ బాబు ...డి.హెచ్.ఆర్
మరియు
ఒరుగు కృష్ణారావు ...జే.డి.ఆర్

ఏలూరు జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా, నూజివీడు మండలం, గొల్లపల్లి పంచాయితీ, గొల్లపల్లి గ్రామ ఆర్.యస్.నెం. 146 దాఖలా 500 చ॥గజముల నివేశన స్థలం మరియు సదరు స్థలంలో నిర్మింపబడియున్న డో.నెం. 4-54 మరియు అసెస్‌మెంట్ నెం. 482 దాఖలా ఆర్.సి.సి. డాబా ఇల్లు, సదరు ఇంటికి అమర్చబడిన యావత్ పరికరములతో సహా పై తెలిపిన జే.డి.ఆర్. యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో వుండి ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు ఛార్జి కాబడి, వేలం కావలసియున్న ఆస్థికి హద్దులు:
తూర్పు: రోడ్డు. ***దక్షిణం:*** బి.నాగేంద్రం గారి ఆస్థి.
పడమర: రోడ్డు. ***ఉత్తరం:*** వై.వెంకటేశ్వర రావు గారి ఆస్థి.

డి.హెచ్.ఆర్ విలువ : రూ.5,00,000/-
అమీనా విలువ : రూ.7,50,000/-

పైన తెలిపిన ఆస్థిని శ్రీ కోర్టు వారు **ది. 04-05-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు బహిరంగ వేలం వేయుదురు.** కావున కావల్సినవారు పాడుకొనవచ్చును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

యమ్.రమేష్
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది,
నూజివీడు. సెల్: 94402 57636